ప్రజాశక్తి

గురువారం 16 ఫిబ్రవరి 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

- 'పది'లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి
- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని అధిరోహించేందుకు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. చీరాల పట్టణంలోని కస్తూరిబా గాంధీ పురపాలక బాలికోన్నత పాఠశాలను బుధవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు శ్రద్ధతో చదవాల న్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించి తాము చదువుకుంటున్న పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో కొంత సమయాన్ని గడిపి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వికె. రామారావు, మున్సిపల్ కమిషనర్ ఏసయ్య, తహశీల్దారు ప్రభాకర రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి 'తల్లులు'.!

- బాల్యవివాహాలతో బాలికల జీవితాలు చిన్నాభిన్నం
- 13 ఏళ్లకే గర్భం దాలుస్తున్న వైనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గత రెండేళ్లుగా బాల్య వివాహాలు పెరిగాయి. బాల్యవివాహాల వల్ల బాలికల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయి 13 ఏళ్ళకే గర్భిణుల వుతున్నారు. చిన్నవయస్సులోనే గర్భం దాల్చడం వల్ల బాలికలు రక్తహీనత, పోషకాహార లోపానికి గురవుతున్నారు. అదేవిధంగా శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాపట్ల జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నట్లు వెల్లడవుతున్న క్రమంలో నూతన జిల్లా ఏర్పడిన గతేడాది ఏప్రిల్ నాలుగు నుంచి జిల్లాలో జరిగిన బాల్యవివాహాలపై సర్వే చేయనున్నారు.

అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం బాపట్ల జిల్లాలో 16 ఏళ్ల వయస్సు లోపు గర్భిణులుగా ఉన్నవారు 30 మంది ఉన్నారు. వీరిలో 10 మంది బాలికలు ఇప్పటికే తల్లులయ్యారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు 217 మంది గర్భిణులుగా ఉన్నారు. 13 ఏళ్ళకే తల్లులయిన వారు కూడా ఉన్నారు. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ వచ్చిన నేపథ్యంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది గ్రామ స్థాయి వరకూ ఉంటున్నారు. ఆయా గ్రామాలు, పట్టణ వార్డుల్లో బాల్యవివాహాలు నిర్వహిస్తే తెలుసుకోవడం సులువు. వాటిని నిరోధించవచ్చు. కానీ ఈ అంశాన్ని పట్టించుకోని కారణంగా యథేచ్ఛగా బాల్యవివాహాలు జరుగుతున్నాయి. వీటిని కట్టడి చేసేందుకు విస్తృతమైన సమిష్టి కృషి అవసరం.

తల్లిదండ్రుల ఆందోళన కారణంగా బాల్యవివాహాలు..

పేదరికం, నిరక్షరాస్యత, బాలికలను జాగ్రత్తగా పెంచలేమన్న అభద్రతా భావం లాంటి కారణాలు బాల్య వివాహాలు జరిపించేందుకు దోహదపడుతున్నాయి. చట్టాలు ఎన్ని ఉన్నా బాల్య వివాహాలు ఆగడం లేదు. అధికారుల దష్టికి 10 శాతం మాత్రమే వస్తున్నాయి. 90 శాతం బాల్యవివాహాలు గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతున్నాయి. ప్రస్తుత కాలంలో చాలా మంది బాలికలు 13 ఏళ్ళకే యుక్త వయస్సుకు వస్తున్నారు. వీరిలో స్కూల్‌కు కెళ్ళే వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. పొలం పనులు, కూలి పనులకు వెళ్ళే కుటుంబాల్లో బాలికల తల్లిదండ్రులు తమ తమ బిడ్డల రక్షణ పట్ల ఆందోళన చెందుతున్నారు. తాము పనులకు వెళ్తూ తమ బిడ్డని ఇంటి దగ్గర వదిలి వెళితే ఏమతుందో అన్న ఆందోళన వారిలో ఉంటోంది. పెళ్ళి చేస్తే తమ బాధ్యత తీరి పోతుందని ▶ 2లో

మెడికల్ కళాశాలకు భూములిస్తే..

అన్యాయం చేస్తారా..!

బాధిత రైతుల ఆవేదన

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి అనుకులమైన ప్రదేశం రాయవరం సమీపంలోని జాతీయ రహదారి 565 అనుకుని ఉన్న భూములను ఎంపిక చేశారు. రాయవరం గ్రామానికి చెందిన భూయజమానులు కూడా ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం కోసం త్యాగం చేశారు. ఉన్నత వైద్యం అందుబాటులోకి వస్తుందని, ఎందరో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను దక్కించుకోవచ్చని ఖరీదైన భూములను సైతం వదులుకున్నారు. త్యాగం చేసిన భూయజమానులకు అన్యాయం జరుగుతోంది. భూ సేకరణ సమయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇచ్చిన మాటపై నిలబడక పోవడంతో భూములను వదులుకున్న రైతులు మాత్రం ఆవేదనలో మునిగారు.

మార్కాపురం సమీపంలోని రాయవరం గ్రామం వద్ద మార్కాపురం-ఒంగోలు రదాహరి అనుకుని ఉన్న 53 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సేకరించారు. అందులో 20 ఎకరాల భూమి రహదారి ఆనుకుని ఉంది. ఆ భూమి ఎనిమిది మంది రైతులకు చెందినది. మిగిలిన భూమి ప్రభుత్వానికి చెందింది. భూమి జాతీయ రహదారి ఆనుకుని ఉన్నందున విలువ పెరిగింది. ప్రభుత్వ మెడికల్ కళాశాల కోసం అక్కడి రైతులు పెద్ద మనసుతో వదులుకున్నారు. ప్రస్తుతం అక్కడ ఎకరం భూమి విలువ రూ. కోటి వరకు పలుకుతోంది. రైతులకు ఎంత భూమిని కోల్పోతున్నారో... అంతే భూమిని రహదారి ఆనుకుని ఇస్తామని అప్పట్లో అధికారులు చెప్పారు. దాంతో పాటు భూమిని సాగులోకి తీసుకువచ్చేందుకు ఒక్కో ఎకరానికి రూ. 3 లక్షలు ఇస్తామన్నారు. ఈమేరకు రైతుల నుంచి అగ్రిమెంటు తీసుకున్నారు. అనంతరం రైతుల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మెడికల్ కళాశాల నిర్మాణంలో ఉంది.

నిర్మాణ దశలో మెడికల్ కళాశాల

భూమిని సేకరించి మూడేళ్లు దాటినా... నేటికీ అక్కడి రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పజా ప్రతినిధులు కూడా వారి ఆవేదన పట్టించుకోవడం లేదు. ఎంత కాలం సాయం కోసం వేచి చూడాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా తమకు ఇచ్చిన మాటకు కట్టుబడి లేకపోతే... నిర్మాణ పనులను అడ్డుకునేందుకు వెనుకాడబోమని రైతులు హెచ్చరిస్తున్నారు. రూ. కోట్ల మేర ఆస్తులను వదులు కుంటే... భూమికి బదులు భూమిని... దాన్ని సాగులోకి తెచ్చేందుకు ఇస్తామన్న రూ. 3 లక్షల కోసం ▶ 2లో

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

బాల్య వివాహాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బాల్య వివాహాల నియంత్రణపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. ప్రకాశం భవనంలోని కలెక్టర్ ఛాంబర్‌లో 'సామాజిక ప్రవర్తన మార్పు' పై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడూతూ సచివాలయ స్థాయిలో ప్రతి వివాహాన్ని మహిళా పోలీసులు తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలన్నారు. బాల్య వివాహాలను జరిపిస్తే కుటుంబ సభ్యులు, పాస్టర్లు, పురోహితులు, ఇమామ్‌లపై కేసులు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో ప్రతి నెలలో మొదటి బుధవారం, మండల స్థాయిలో రెండవ బుధవారం, జిల్లా స్థాయిలో మూడవ బుధవారం బాల్య వివాహాల నియంత్రణ కమిటీ తప్పని సరిగా సమావేశమయ్యే విధంగా ఆదేశాలు జారీ చేయాలని జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. బాల్య వివాహాలతో సామాజికంగా, ఆరోగ్య పరంగా కలిగే దుష్ప్రభావాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గిరిజన ప్రాంతాలలో ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. బడికి వెళ్లని బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇందు కోసం ఐఇసి మెటీరియల్ తయారు చేయాలన్నారు. సంబంధిత శాఖలలో సిబ్బందిని ▶ 2లో

చిన్నారి 'తల్లులు'.!

(మొదటి పేజీ తరువాయి)

భావించి బాల్య దశలోనే వివాహాలు చేస్తున్నారు. చదువుకునే ఆడపిల్లల్లో కూడా ఐదు లేదా ఏడో తరగతి వరకూ తమ గ్రామంలోనే అవకాశం ఉంటుంది. ఆపై చదువులకు వెళ్ళాలంటే దూరంగా వెళ్ళాలి. ఈ కారణంగా వారు అర్ధాంతరంగా చదువుకు స్వస్తి చెప్పి ఇంటిలోనే ఉంటున్నారు. ఆడబిడ్డని భారంగా భావిస్తున్న తల్లిదండ్రులు వారికి చిన్నతనంలోనే వివాహం చేస్తున్నారు. పెళ్లి, దాంపత్య జీవితం గురించి ఎలాంటి అవగాహన లేని బాలికలు.. ఆ వెంటనే గర్భిణులు అవుతున్నారు.

బాల్య వివాహం వల్ల వచ్చే సమస్యలు..

అమ్మాయిలకు 18 ఏళ్లు నిండకముందే, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండకముందే వివాహం చేయడం వారి ఆరోగ్యానికి అంత క్షేమకరం కాదు. ప్రధానంగా స్త్రీలు త్వరగా రక్తహీనతకు గురికావడం, అనారోగ్య శిశువులు జన్మించడం, అవయవ ఎదుగుదల లేకపోవడం, శిశు మరణాలు ఎక్కువగా జరుగుతాయి. చిన్నవయస్సులో గర్భం దాల్చడంవల్ల వారు త్వరగా బలహీనంగా మారతారు. ఆమెకు పుట్టే బిడ్డకు జన్యుపరమైన సమస్యలు, పోషక లోపాలతో జన్మిస్తారు.

బాల్యవివాహాల నిరోధక చట్టం 2006..

బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం 18 ఏళ్ల లోపు ఆడపిల్లలు, 21 ఏళ్ల లోపు మగపిల్లలు బాలల కిందే వస్తారు.బాల్య వివాహం గురించి సమాచారం తెలిసిన ఎవ్వరైనా ఫిర్యాదు చేయవచ్చు. బాల్య వివాహం చేసిన వారు నేరస్తులే. తల్లిదండ్రులు, సంరక్షకులు, పురోహితులు, స్నేహితులు, ఇరుగుపొరుగువారు, బాల్య వివాహానికి అనుమతించిన కులపెద్దలు, వివాహ ఏర్పాట్లకు సహకరించిన వారందరూ నేరస్తులే.. పెళ్లికి హాజరైనవారు కూడా నేరస్తులవుతారు. నేరస్తులకు రెండేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష పడొచ్చు. లక్ష రూపాయల వరకు జరిమానా విధించవచ్చు. ఈ చట్టం ప్రకారం బాల్యవివాహాలను నిలుపుదల చేస్తూ కోర్టు ఇంజెంక్షన్ ఆర్డర్ ఇవ్వవచ్చు. ఈ నేరాలకు బెయిల్ కూడా ఉండదు. బాల్య వివాహాలపై కలెక్టర్ విజయకృష్ణన్ తీవ్రంగా స్పందించారు. బాలికను వివాహం చేసుకున్న వ్యక్తిపై, సహకరించిన వారిపై పోక్సో చట్టం కింద కేసు పెట్టాలని ఆదేశించారు.

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు చట్ట ప్రకారం జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ, ప్రాజెక్ట్ స్థాయిలో సిడిపిఒలు ఉన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్లు, గ్రామస్థాయిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, విఎఒలు, మహిళా పోలీసులుఉన్నారు.

వివాహ నమోదు చట్టంతో చెక్

బాల్య వివాహాలను అడ్డుకొనేందుకు 'వివాహ నమోదు చట్టం' (మ్యారేజ్ రిజిస్ట్రేషన్ యాక్ట్) నిబంధన కచ్చితంగా అమలు జరపాలి. వధూవరుల వయస్సు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తేనే మ్యారేజ్ రిజిస్టర్ చేయాలి. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు (ఫోన్ నంబర్ 100), మహిళా శిశు సంక్షేమ శాఖ పథకం సంచాలకులు, ఐసిడిఎస్, చైల్డ్‌లైన్(ఫోన్ నంబర్ 1098), తహశీల్దార్, సిడిపిఒ, గ్రామస్థాయిలో విఆర్ఒ,, పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయవచ్చు.

బాల్యవివాహాలు జరగకుండా చర్యలు

డాక్టర్ విజయమ్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో బాల్యవివాహాలు అధిక సంఖ్యలో జరుగుతున్నట్లు వెల్లడవుతున్న నేపథ్యంలో జిల్లాలో గతేడాది కాలంలో జరిగిన వివాహాలు.. అందులో బాలికల వివాహాలు ఎన్ని జరిగాయనే విషయమై సర్వే జరుపుతున్నాం. కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు ఇక మీదట 18 ఏళ్ళ లోపు బాల్యవివాహాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. చిన్న వయస్సులోనే తల్లులయిన వారిని గుర్తించి రెండో సారి కొన్ని సంవత్సరాల పాటు గర్భం దాల్చకుండా చర్యలు తీసుకుంటాం.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపిటీఎఫ్ బాపట్ల జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు బివి రవి కుమార్ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర పిలుపు మేరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

అడవిలో యువకుడి మృతదేహం దహనం

ప్రజాశక్తి-తర్లుపాడు

ఓ యువకుడిని ఎక్కడో హత్య చేసి తాడివారిపల్లె ఘాట్ రోడ్డు వద్ద ఫారెస్ట్‌లో దహనం చేశారు. హత్యకు గురైన బత్తుల దేవధరన్(23) నంద్యాల జిల్లాకు చెందిన ఉయ్యాలవాడ మండలం పెద్దయమ్మవరం గ్రామానికి చెందినవాడు. జీవనోపాధి నిమిత్తం దేవధరన్ గత కొంతకాలంగా విశాఖపట్టణం పాత నగరం టౌన్ హాల్ ప్రాంతంలో హెూటల్‌లో పని చేసేవాడు. జనవరి నెలలో తన సొంత గ్రామానికి వెళ్తానని హెూటల్ మేనేజ్మెంట్‌తో చెప్పి వెళ్లిపోయాడు. సొంత గ్రామానికి బయలుదేరి 10 రోజులు గడుస్తున్నా తమ పిల్లవాడి ఆచూకీ లేకపోవడంతో తండ్రి సుబ్బరాయుడు తన కుమారుడు పని చేస్తున్న హెూటల్ పరిసరాల్లో విచారించాడు. తన కుమారుడి ఆచూకీ ఎవరూ చెప్పకపోవడంతో విశాఖపట్నం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తన కుమారుడి ఆచూకీ తెలియడం లేదని ఫిర్యాదు చేశారు. విశాఖపట్నం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఇదే సమయంలో తర్లుపాడు మండలం తాడివారిపల్లి ఘాట్ రోడ్‌లో గుర్తు పట్టకుండా పూర్తిగా 80 శాతం గాయాలతో కాలిపోయిన శవాన్ని స్థానికులు గుర్తించి తాడివారిపల్లె పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాడివారిపల్లి పోలీస్‌లు ఇచ్చిన సమాచారం మేరకు వైజాగ్ పోలీసులు, మృతుని బంధువులు వచ్చి

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) దేవధరన్ (ఫైల్)

ఆ మృతదేహం అదృశ్యమైన దేవధరన్‌దిగా గుర్తించారు. బుధవారం పొదిలి సీఐ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సంఘటనా స్థలంలో శవాన్ని ఖననం చేశారు. ఈ హత్యకు వివాహేతర సంబంధం కారణమని పోలీసులు గుర్తించారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తాడివారిపల్లి ఎస్ఐ పి ముక్కంటి నిందితుల గాలింపు కోసం వెళ్లగా ఏఎస్ఐ ఏ రామకృష్ణారెడ్డి, రైటర్ రమేష్ సీఐతో పాటు ఉన్నారు.

శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

వెల్లంపల్లి పొగాకు బోర్డు ఎఎస్‌ఒగా శ్రీనివాస్

ప్రజాశక్తి-మద్దిపాడు

వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణధికారిగా సత్య శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వీరు నెల్లూరు జిల్లా కలిగిరి నుంచి బదిలీపై వెల్లంపల్లి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న సురేంద్ర జంగారెడ్డి వేలం కేంద్రానికి వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటుధర కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. వీరిని ఎఫ్ఒ చలమయ్య ఎఫ్ఏ వెంకటరెడ్డి, రైతు నాయకులు నారిపెద్ది వరహాల చౌదరి తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

ప్రజాశక్తి-పొదిలి: వివాహేతర సంబంధం ఓ వ్యక్తి ప్రాణం తీసినట్లు దర్శి డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. డిఎస్‌సి కథనం ప్రకారం... పొదిలి సర్కిల్ పరిధిలోని తాడివారి పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ అనుమానాస్పద మతదేహాన్ని గుర్తించారు. విచారణలో మృతుడు నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం పెదయమ్మనూరు గ్రామానికి చెందిన బత్తుల దేవధరణి (22)గా నిర్ధారణ అయ్యింది. ధరణి చిన్నప్పటి నుంచి చెడు వ్యసనాలకు బానిసయై మహిళలతో ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడేవాడు. మృతుడి అన్న పవన్ సాయి దేవధరణిని విశాఖపట్నం తీసుకెళ్లి ఓ రెస్టారెంట్లో పనికి కుదిర్చాడు. అయినప్పటికీ ధరణి ఫోన్ చాటింగ్ చేస్తూ ఓ యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అదే యువతి ఆళ్లగడ్డ మండలం అహోబిలం చెందిన రాగిరి ప్రవీణ్ కుమార్‌తోనూ వివాహేతుర సంబంధం పెట్టుకుంది. ఈ విషయమై మృతుడు ధరణి, నిందితుడు ప్రవీణ్‌కుమార్‌కు మధ్య గొడవ జరిగింది. ధరణి అన్న పవన్ సాయి ఇద్దరి మధ్య సర్దుబాటు చేశాడు. అయినప్పటికీ ధరణి ఆ యువతితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో ఎలాగైనా ధరణి చంపాలని ప్రవీణ్ కుమార్ కుట్రపన్నాడు. అందులో భాగంగా ఓ పథకం ప్రకారం నిందితుడు ప్రవీణ్ కుమార్ గత జనవరి 31న సాయంత్రం సమయంలో తన మిత్రులు మనోజ్, చాణక్య, శివకుమార్ నరేష్, మరో యువతితో మృతుడితో మాట్లాడించి మాయమాటలు చెప్పించి అద్దె కారులో ఎక్కించుకున్నారు. అనతరం అతడి నోట్లో క్లోరోఫామ్ పోశారు. ఈ నెల 1న అర్ధరాత్రి సమయంలో ఒంగోలు-నంద్యాల మార్గంలో గొట్లగట్టు దాటిన అనంతరం ఘాట్ రోడ్డులో కారు ఆపి ధరణిని కిందకు దించి నిందితులు తమతో తెచ్చిన కత్తితో మెడ కోశారు. అనంతరం పెట్రోల్‌తో కాల్చి చంపారు. ఈ క్రమంలో తన తమ్ముడు కనిపించడం లేదని మృతుడి అన్న పవన్ సాయి విశాఖపట్నం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో అద్దె కారు డ్రైవర్ శివ కిరణ్‌ను పట్టుకున్నారు. కారు డ్రైవర్‌ను విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కార్యక్రమంలో పొదిలి సిఐ సుధాకర్‌రావు, తాడివారిపల్లి ఎస్ఐ ముక్కంటి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు భూములిస్తే.. అన్యాయం చేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

ఎంత కాలం వేచి చూడాలని మండిపడుతున్నారు.

నమ్మకం పోయింది.

భూ యజమాని రమణారెడ్డి

మెడికల్ కళాశాల నిర్మాణం కంటే ముందుగా ఇచ్చిన మాట ప్రకారం భూమి ఇచ్చిన రైతులను ఆదుకుంటామని అప్పట్లో చెప్పారు. దీంతో భూమి మూడున్నర ఎకరం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఇచ్చారు. పరిహారం కోసం ప్రజా ప్రతినిధుల చుట్టూ... అధికారుల చుట్టూ తిరగడం తప్ప ఫలితం కానరాడం లేదు. సాయం అందుతున్న నమ్మకం కూడా పోయింది. రూ. కోట్ల మేర విలువ చేసే ఆస్తులను వదులుకుంటే... ప్రభుత్వం ఈ విధంగా అన్యాయానికి గురిచేస్తుంది.

బాల్య వివాహాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించి వారికి ఈ కార్యక్రమంపై శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామ, మండల స్థాయి సభ్యులకు కూడా శిక్షణ ఇచ్చి వీరి ద్వారా ప్రతి కుటుంబంలో పిల్లలు పాఠశాలలకు వెళ్లే విధంగా చైతన్య పరచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ విషయంపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇచ్చే పోషణ కిట్లను పరిశీలించాలన్నారు. ఇచ్చిన పోషణ కిట్లను వారు సక్రమంగా వినియోగించుకుంటున్నారో లేదో మహిళా పోలీసు ప్రతి ఇంటికీ వెళ్లి సమాచారాన్ని సేకరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా, దాని పరిమాణం సరిపడా ఉందా లేదా? అనే విధంగా పొటోలు తీసి జిల్లా కేంద్రానికి పంపాలన్నారు. ఈ నివేదికలను మండల స్పెషల్ ఆఫీసర్లకు అందజేయాలన్నారు. ఈ విషయంపై ప్రత్యేక దష్టి పెట్టాలని ఐసిడిఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ లక్ష్మీదేవి, డిఎం,హెచ్ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, మెప్మా పీడీ టి.రవికుమార్,డిఆర్‌డిఎ పీడీ బి.బాబూరావు, డిఇఒ పి.రమేష్. జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి ఉషారాణి, డిసిపిఒ దినేష్ కుమార్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

OS NO: 120/2015

నామాల శ్రీనివాసరావు, అలియాస్ శ్రీనివాస్ చౌదరి -వాది.

మరియు

1.మేదరమెట్ల సుధారాణి వగైరాలు. -ప్రతివాదులు

To,

D7. సుదుల అమరత్నం w/o వెంకటేశ్వర్లు, కొత్త అన్నసముద్రం గ్రామం, త్రిపురాంతకం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో పై కోర్టు వారి ద్వారా ఇప్పటికి అనేక పర్యాయములు నోటీసులు జారీ చేయించగా మీరు కోర్టు వారి దావా నోటీసులు తీసుకొనక కాలయాపన చేసినందున ఈ పేపర్ ప్రకటన ద్వారా ఈ యొక్క నోటీసు నిమిత్తం 22-02-2023 కి వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా రోజు ఉదయం 10:30 గం.ని లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల దావా మీ పరోక్ష మందు తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వులతో వాయిదా ది.22-02-2023.

ఇట్లు.
బి అనిల్ కుమార్,
వాది తరపు న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

మహారాజశ్రీ ఒంగోలు ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో

OS No 79/2009

1.చక్కా మహాలక్ష్మమ్మ మరియు ఒకరు ....పిటిషనర్లు / వాదులు

వర్సెస్

తాళ్లూరి సావిత్రమ్మ (డైడ్) మరియు ఇతరులు ...ప్రతివాదులు

To

ఆర్7) తుమ్మ పూడి అనంతలక్ష్మి
భర్త సుధాకర రావు, నివాసం మూలగుంటపాడు గ్రామం సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా

పై దావా లో వాదులు మీపై పిటిషన్ దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తేదీ 20.02.2023 న కు వాయిదా అయిఉన్నది ఆరోజు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు మీరు పై తెలిపిన కోర్టునకు స్వయంగా గాని లేదా లాయర్ గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలుపు కొనవలేయను అట్లా కానిచో మీ పరోక్షంగా విచారించి తీర్మానించ బడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
కనపర్తి నాగేశ్వరరావు
అద్వకేట్,ఒంగోలు

ఒంగోలు 8 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

OS No: 71/2021

1.గొర్రెముచ్చు బ్లెస్సి బాబు అండ్ అదర్ ...వాదులు

వర్సెస్

గొర్రె ముచ్చు బాలు అండ్ అదర్స్ ...ప్రతివాదులు

To

D5) మునగపుడి. శివదుర్గ,
భర్త లీలా క్రిష్ణ మూర్తి,
నివాసం: ముత్యాల పేట, పేరాల-చీరాల,
బాపట్ల జిల్లా

D6) సలగాల శామ్యూల్ రాజు. తండ్రి దావిద్,
నివాసం: హయర్ పేట, పేరాల , చీరాల,
బాపట్ల జిల్లా.

D8) పొన్నాడ. విజయ దుర్గ
భర్త : శ్రీనివాస రావు నివాసం: హౌసింగ్ బోర్డు కాలని, ఒంగోలు ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో మీకు నోటీసులు జారీ కానందున కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఉత్తర్వులు జారీ చేసినారు కనుక మీరు తేదీ : 01.03.2023 న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను లేనియెడల మీ పరోక్షంలో తీర్మానించ బడునని తెలుసుకోవలసినది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు.
P.పద్మావతి.
వాదుల తరుపు న్యాయవాది,
ఒంగోలు

శాంతి భద్రతల పరిరక్షణలో..

సాయుధ దళాల సేవలు కీలకం

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ● 6 రకాల అత్యాధునిక ఆయుధాలతో 70 రౌండ్లు ఫైరింగ్ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా పోలీసు యంత్రాంగం అత్యవసర సమయాలలో ప్రజల, ప్రభుత్వ, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు కీలకమని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బుధవారం ప్రకాశం జిల్లా చీమకుర్తి వద్ద ఉన్న ఫైరింగ్ రేంజ్‌లో బాపట్ల జిల్లా సాయుధ బలగాల వార్షిక ఫైరింగ్ సాధన ప్రక్రియను బాపట్ల జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఫైరింగ్ రేంజ్‌లో ఎస్పీ, పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది తుపాకులు చేత బట్టి ఫైరింగ్ సాధనలో పాల్గొన్నారు. వార్షిక ఫైరింగ్ సాధనలో భాగంగా తర్ఫీదు పొందుతున్న బాపట్ల జిల్లా ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బందికి ఫైరింగ్ ప్రక్రియ గూర్చి ఎస్పీ పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని నీల్ పొజిషన్, స్టాండింగ్ పొజిషన్‌లో 6 రకాల అత్యాధునిక ఆయుధాలతో 70 రౌండ్లు ఫైరింగ్ ప్రాక్టీస్ చేసి సిబ్బందిలో ఉత్సాహాన్ని, మనోధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వార్షిక ఫైరింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఫైరింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని మెలకువలు నేర్చుకొని, ఫైరింగ్‌లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క బుల్లెట్టు టార్గెట్ (లక్ష్యం) వైపే పడే విధంగా తర్ఫీదు పొందాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు కీలకమన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చు కొని జిల్లా పోలీసు శాఖ ఉన్నతి కోసం ముందడుగు వేయాలని సూచించారు. కొత్తగా వచ్చిన ఆయుధాల గురించి పూర్తి స్థాయిలో తర్ఫీదు పొంది, అత్యవసర సమయాలలో ప్రజల, ప్రభుత్వ, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి పి మహేష్, బాపట్ల జిల్లా ఏఆర్ డిఎస్పి ఎండిహెచ్ ప్రేమ్ కుమార్, బాపట్ల డిఎస్పి ఏ శ్రీనివాసరావు, చీరాల డిఎస్‌పి పి శ్రీకాంత్, బాపట్ల ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, అడ్మిన్ ఆర్ఐ ఎల్ మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి శ్రీకాంత్ నాయక్, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా పోలీస్ వార్షిక ఫైరింగ్ సాధన ప్రక్రియలో పాల్గొన్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పోలీసులు

ముందస్తు చర్యలు పాటించాలి: ఏవో

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

పీడపీడల నుంచి శనగ పంటను కాపాడుకోవాలంటే రైతులు ముందస్తు జాగ్రత్త లు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయ అధికారి పి పావని పేర్కొన్నారు. మండలంలోని మద్దులూరు గ్రామంలో బుధవారం గ్రామ వ్యవసాయ సహాయకులచే శనగ పంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వ్యవసాయ అధికారి పావని పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. శనగ పంటలో అంతర పంటగా ధనియాల పంటను 12:4 వరుసల నిష్పత్తిలో వేయాలని, ఒక ఎకరానికి 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలని, నాలుగు చోట్ల లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసినట్లయితే శనగపచ్చ పురుగు, లద్దె పురుగుల ఉనికిని గమనించ వచ్చునని అన్నారు. శనగకు రక్షక పంటగా చుట్టూ జొన్న, సజ్జ పంటలను వేయాలని, ఎర పంటగా పొలంలో అక్కడక్కడా బంతి మొక్కలను వేయాలని సూచించారు. అనంతరం ఎం వేములపాడు, చిలకపాడు గ్రామాలలో ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సుబ్బారెడ్డి గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటరాజా, జయకృష్ణ, కోటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

60 శాతం వికలత్వం ఉన్నా పింఛను రావడం లేదు

ప్రజాశక్తి-మద్దిపాడు: తనకు 60 శాతం అవిటితనం ఉన్నట్లు వైద్యులు ధ్రువ పత్రం మంజూరు చేసినా తనకు పింఛన్ రావడం లేదని బసవన్నపాలెం గ్రామానికి చెందిన రావి అన్వేష్ తెలిపారు. సంవత్సరం క్రితం తాను పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. గ్రామ వాలంటీరు సిఫారసు చేసినా పింఛన్ మంజూరు కాకపోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించారు. ఏడాది కాలంగా తాను పింఛన్ నష్టపోయానని వాపోయారు. అర్హత ఉన్నా పింఛన్ రాకపోవడం అన్యాయ మని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి యు వెంకటేశ్వర్లు తెలిపారు.

లోకేష్ పాదయాత్రకు ఎస్‌టి సెల్ సంఘీభావం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్రకు ఆ పార్టీ బాపట్ల పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్‌టి సెల్ నాయకులు సంఘీభావం తెలిపారు. మంగళ వారం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని సత్యవేడు నియోజవర్గంలో విత్తులతడక నుంచి కేలపూడి వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన అభివృద్ధికి సంబంధించిన సంక్షేమ పథకాలను, గతంలో ఉన్న రాయితీలను రద్దు చేశారని అన్నారు. గిరిజనులకు గతంలో షెడ్యూల్ ప్రాంతంలో 7 అసెంబ్లీ స్థానాలు ఉండేవని, 1962లో 4 అసెంబ్లీ స్థానాలు ఉండేవన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఆ స్థానాలు జనరల్‌గా మార్చుకున్నారన్నారు. గిరిజనుల అభివృద్ధి టిడిపి హయాంలోనే జరిగిందని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపునకు ఎస్‌టి సెల్ నాయకులంతా ఐక్యంగా ఉండి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ ఎస్‌టి సెల్ నాయకులు ఎన్ అంకులు, కొమరగిరి నాగేశ్వరావు, ఏ వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు ఎన్ జయలక్ష్మి, తిరుపతయ్య, కుమార్, మహేంద్రబాబు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కంభం రూరల్

మండల పరిధిలోని తురిమెళ్ల, యర్రబాలెం గ్రామల మధ్యలోనున్న గుండ్లకమ్మ వాగులో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. ఈ విషయం గురించి కంభం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కంభం ఎస్ఐ నాగ మల్లేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వాగులోంచి మృతదేహాన్ని ఒడ్డుకు తీయించారు. మృతుడు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

చీరాలలో పోలీసులు కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-చీరాల

ప్రజల ప్రాణాలు తీస్తున్న నాటుసారా అమ్మకాన్ని పూర్తిగా నిలిపి వేయాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని రెండో పట్టణ సీఐ సోమ శేఖర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ పి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున రెండో పట్టణ స్టేషన్ పరిధిలోని రాంనగర్, ఆదినారాయణపురం, రైల్వేట్రాక్, ఆర్టీసీ గ్యారేజ్ తదితర ప్రాంతాల్లో కార్డన్ సర్చ్‌ను సుమారు 70 మంది పోలీసు సిబ్బందితో నిర్వహించారు. ప్రతి ఇంటినీ, ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో భాగాంగా డాడుల్లో నాటుసారా తయారీకి సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి వాటిని ధ్వంసం చేసినట్లు సీఐ చెప్పారు. అదేవిధంగా 4 లీటర్ల సారాతో పాటు సరైన పత్రాలు లేని 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సారా తయారీ ప్రాంతాల్లో సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని తెలిపారు. సారా వల్ల కలిగే అనర్థాలపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్, చంద్రావతి, ఈపూరుపాలెం ఎస్ఐ పి జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా ఊటను పట్టుకున్న పోలీసులు

కన్న కొడుకు నుంచి రక్షణ కల్పించండి

పోలీసులను ఆశ్రయించిన తల్లి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

తనపై దాడికి పాల్పడ్డ కొడుకు, కోడలు నుంచి రక్షణ కల్పించాలంటూ ఓ తల్లి మార్టూరు పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన 72 సంవత్సరాల వృద్ధ మహిళ నూతక్కి జయమ్మను, ఆమె కన్నకొడుకు వీరనారాయణ ఈ నెల 4న ఇల్లు తనకు చెందకుండా చేస్తుందని అత్యంత కిరాతకంగా దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డ ఆమెను గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్న సంగతి పాఠకులకు తెలిసిందే. అక్కడి వైద్యులు జయమ్మను పరీక్షించి వెన్నుపూస రెండుచోట్ల విరిగిందని, ఈ వయసులో ఆమెకు ఆపరేషన్ చేస్తే కష్టమని మూడు నెలల తర్వాత సర్జరీ చేద్దామని తెలిపినట్లు జయమ్మ విలేకరులకు తెలిపింది. ఈ నేపథ్యంలో 11 రోజుల చికిత్స అనంతరం బుధ వారం రాత్రి గుంటూరు నుంచి స్వగ్రామం ద్రోణాదుల వెళుతూ అంబులెన్స్‌లో జయమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. తాను, తన భర్త నిర్మించుకున్న ఇంటిలోకి తనను వెళ్లకుండా తన కుమారుడు తిరిగి దాడి చేసే ప్రమాదం ఉందని, తనకు రక్షణ కల్పించా లంటూ పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ కమలాకర్ ఆ సమయానికి ద్రోణాదుల గ్రామంలోనే ఉన్నారని తగు చర్యలు తీసుకొని జయమ్మకు న్యాయం చేస్తారని పోలీసులు తెలపడంతో అంబులెన్సులో ఆమె కుమార్తెలు ద్రోణాదుల తరలించారు.

నేడు సెబ్ కేసుల్లో వాహనాల వేలం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ దాడుల్లో పట్టు బడిన వాహనాలను గురువారం బాపట్ల సెబ్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో వాహనాలు టీవీఎస్ స్టార్ సిటీ, టీవీఎస్ ఎక్సెల్ సూపర్ హెవీ డ్యూటీ, ఆటో, హోండా మోటార్ సైకిల్ వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు. సెబ్ నిబంధనల మేరకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కాలిపోయిన ఇంటిలోని వస్తువులు

రెండు పెంకుటిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-వేటపాలెం

తాళం వేసి ఉన్న రెండు పెంకుటిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం సంభవించింది. దీంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఈ ఘటన మండల పరిధిలోని రామన్నపేటలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దేవన మార్కండేయులు, ప్రసాదరావు, దేవన ప్రసూనాంబలు దేవాంగపురి చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి మహోత్సవం కార్యక్రమానికి బంధువుల ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి దట్టమైన పొగలు వెలువడడంతో చుట్టుపక్కల వారికి అనుమానంతో వచ్చిచూశారు. జరుగుతున్న అగ్నిప్రమాదాన్ని గుర్తించి చీరాల ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో చీరలు నేసే మగ్గాలు కాలిపోయినట్లు చెబుతున్నారు. సకాలంలో మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకొన్న బాధితులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు.

కాలువలో జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

సాగరు కాలు వలో కాలు జారి మహిళ మృతి చెందిన సంఘటన ఇంకొల్లు మండలంలోని ఇడుపుల పాడులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇడుపులపాడు గ్రామానికి చెందిన గుమ్మడిల్లి రాఘవమ్మ(45) తన భర్త శ్రీహరిబాబు వ్యవసాయ పనుల్లో భాగంగా పొలంలో పురుగు మందు పిచికారీ చేస్తుండగా భర్తకు సాయం చేసేందుకు పొలం వెళుతున్న సమయంలో రాఘవమ్మ కాలువ దాటుతుండగా ప్రమాద వశాత్తు కాలుజారి కాలువలో కొట్టుకొని పోయింది. గమనించిన స్థానికులు కేకలు వేసి ఆమెను బయటకు తీసేసరికి అప్పటికే రాఘవమ్మ మృతి చెందింది. మృతు రాలికి భర్త, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

గుండ్లకమ్మ నదిలో పడి పశువుల కాపరి..

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రమాదవశాత్తూ గుండ్లకమ్మ నదిలో పడి పశువుల కాపరి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఇనమన మెల్లూరులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ టి శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన ఎస్ అయ్యప్ప (26) ప్రతి రోజు పశువులు తోలుకొని గ్రామ శివారులో ఉన్న గుండ్లకమ్మకు వెళ్లి పశు వులను మేపుకొని, సాయంత్రానికి తిరిగి ఇంటికి వచ్చేవాడు. బుధవారం రాకపోవడంతో స్థానికులు నదిలో వెతికారు. కనిపించకపోవడంతో ఒంగోలు అగ్నిమాపక సిబ్బంది సహాయంతో స్థానిక పోలీసులు నదిలో గాలించారు. నదిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

20న వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి-పిట్లలవాని పాలెం

చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను ఈ నెల 20వ తేదీ సోమవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు చందోలు ఎస్ఐ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఈ వేలం పాటను స్థానిక తహశీల్దార్ కార్యాల యం ఆవరణలో తహశీల్దార్ సమక్షంలో వాహనాలను వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ వేలం పాటలో పాల్గొని తమకు నచ్చిన వాహనాలను కైవసం చేసుకోవాలని ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల నియమావళి ఇక్కడ వర్తించదా?

ముప్పవరం ఫ్లై ఓవర్ వద్ద తొలగించని ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-పంగులూరు

రాష్ట్రంలో శాసనమండలి ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే అధికారులు హడావుడి సృష్టిస్తూ కొన్ని కార్యక్రమాలను నిలిపివేశారు. కొన్ని కార్యక్రమాలను చేస్తున్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలోనూ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు మొత్తాన్ని తొలగిస్తున్నారు. అధికారపక్షం, ప్రతిపక్షం అని లేకుండా అందరివీ తొలగిస్తున్నారు. మండల కేంద్రమైన పంగులూరులో కూడా తొలగించారు. అయితే జాతీయ రహదారిపై ఉన్న ముప్పవరం గ్రామంలో మాత్రం ఫ్లెక్సీలు

ముప్పవరంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జికి కట్టిన ఫ్లెక్సీలు

తొలగించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీకి చెందిన కార్యకర్తలు తమ అభిమాన నాయకుల పుట్టిన రోజులకు, నూతన సంవత్సర శుభాకాంక్షలు, సంక్రాంతి శుభాకాంక్షలు అని పలు ఫ్లెక్సీలను జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జికి తగిలించారు. వీటిని మాత్రం అటు పంచాయతీ వాళ్లు గానీ, ఇటు రెవెన్యూ వాళ్లు గానీ ఎవరూ తొలగించలేదు. ఇక్కడ ఎన్నికల నిబంధనావళి వర్తించదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎదురుగా పలు ఫ్లెక్సీలు కనిపిస్తున్నా వాటి జోలికి వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు ఇప్పటికైనా ముప్పవరంలోని ఫ్లై ఓవర్‌కు కట్టిన ఫ్లెక్సీలను కూడా తొలగించాలని, అన్నిచోట్ల ఎన్నికల నిబంధనలు పాటించాలని పలువురు కోరుతున్నారు.

లోకేష్ వెంట పాదయాత్రలో పాల్గొన్న ఎంఎం కొండయ్య

లోకేష్ పాదయాత్రలో కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

యువగళం పాదయాత్రలో భాగంగా సత్యవేడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో బుధవారం చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య, నియోజకవర్గ పరిశీలకులు నాతని ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. రాష్ట్రంలో వైసిపి చేస్తున్న అరాచక పాలనపై ఆ పార్టీ విధానాలపై రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పించేందుకు టిడిపి చేపట్టిన యువగళం పాదయాత్రలో పాల్గొని లోకేష్‌తో వారు పర్యటించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

చెరుకూరులో బాల్య వివాహం అడ్డగింత

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం చెరుకూరులో బాల్య వివాహం జరుగుతుందని సమాచారం రావటంతో అధికారులు ఆఘమేఘాలపై చెరుకూరుకు వెళ్లారు. పర్చూరు ఎస్ఐ చెంచు ప్రసాద్, సిడిపిఓ జి సుభద్ర వెళ్లి పెళ్లిని ఆపివేశారు. బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎస్ఐ ప్రసాద్ వివరించారు. ఆడపిల్లలకు ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు అనేక పథకాలు అందిస్తుందన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వారి వెంట అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇంకొల్లులో బ్యాలెట్ బాక్సులు పరిశీలిస్తున్న తహశీల్దారు బ్రహ్మయ్య

బ్యాలెట్ బాక్సుల పరిశీలన

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇంకొల్లు మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉన్న బ్యాలెట్ బాక్సులను తహశీల్దారు పి బ్రహ్మయ్య పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులు ఎలాంటి పరిస్థితిలో ఉన్నాయో సిబ్బందితో చూశారు. ఉన్న బాక్సులు, వాటి పరిస్థితిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు తహశీల్దారు బ్రహ్మయ్య వివరించారు. ఆయన వెంట ఏఎస్ఓ పుష్పలత, విఆర్ఓలు, విఆర్ఏలు ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులు స్థానికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

అంగన్‌వాడీ పోస్టులు స్థానికులకే ఇవ్వాలని మాలమహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షులు శీలం రోజన్ బాబు అన్నారు. బుధవారం ఈ విషయమై బాపట్ల ఐసిడిఎస్ సూపరింటెండెంట్ మందా శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31-1-2023 ఐసిడిఎస్ ప్రాజెక్ట్ బాపట్ల నియోజవర్గ పరిధిలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త, 8 అంగన్‌వాడీ సహాయకురాలు, పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లో స్థానికులే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టంగా ఉండగా స్థానికేతరులు కూడా దరఖాస్తు చేశారు. అలా వచ్చిన అప్లికేషన్లను కూడా సీడీపీఓ అధికారులు తీసుకోవడం చూస్తుంటే పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనివల్ల స్థానిక వార్డుల్లో అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ఇదంతా వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అభ్యర్థులకు అన్యాయం జరిగినా, నియామకాలలో అవకతవకలు జరిగినా, ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ విషయమై సీడీపీఓ వెంకటరమణను వివరణ కోరగా అలాంటి అప్లికేషన్లను రిజెక్ట్ లిస్టులో పెట్టామని తెలిపారు.

గృహ నిర్మాణ లక్ష్యం పూర్తికి ప్రణాళిక

ప్రజాశక్తి-వేటపాలెం

మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ ప్రసాద్

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల గృహ నిర్మాణాలు టార్గెట్ పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పిడి ఎవిఎస్ఆర్‌కెవి ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణం లోని ఐసిడిఎస్ సమావేశం హాలులో జగనన్న కాలనీల లేఅవుట్‌లోని గృహ నిర్మాణాల ప్రగతి రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 15 నాటికి జిల్లాలో 10,714 తగ్గకుండా పూర్తి చేయాలని టార్గెట్ ఇచ్చారన్నారు. వేటపాలెం మండలంలో మొత్తం 510 మంది గృహ లబ్ధిదారులకు డిఆర్‌డిఎ వెలుగు ద్వారా లోన్లు అందించాలన్నారు. బేస్‌మెంట్ లెవల్లో 260, శ్లాబులు పూర్తి అయినవి 104, శ్లాబ్ మట్టానికి వచ్చినవి 124 ఉన్నాయన్నారు. డిఆర్‌డిఎ పిడి బి అర్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, విఓఏలు, పంచాయతీల డిఓలు సమన్వయంతో కలిసి టార్గెట్ అందుకొనేందుకు కృషి చేయాలన్నారు. మండలంలోని ఆరు లేఅవుట్‌లకు సంబంధించిన సిబ్బందిని, విఓఎను వారి పరిధిలో లబ్దిదారులు ఎంతమంది ఉన్నారు. ఎంతమందికి లోన్లు రేజ్ చేయాలో వివరించారు. కొణిజేటి చేనేతపురి లబ్దిదారులు నూరుబాషా, ఖాశింబిల ఇంటి నిర్మాణానికి డ్వాక్రా రుణం యాభై వేలు ఇద్దరు పిడిల సమక్షంలో అందించారు. ఉద్యోగులు అందరూ తప్పనిసరిగా లక్ష్యాన్ని చేరుకోనే విధంగా ప్రతిజ్ఞ చేయించారు. డిఓలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, సోషల్ వెల్‌ఫేర్ ఆఫీసర్ జె రాజదెబోరా, హౌసింగ్ డిఇ గోవిందరెడ్డి, ఎంపిడిఓ ఎంవిఎస్ శర్మ, తహశీల్దార్ గరిక మహేశ్వరి, ఏఇ కాశీవిశ్వనాథం, ఎఇ సుబ్బారావు, ఏపిఎం బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

దాతలను సన్మానించిన నరేంద్రవర్మ ●108వ రోజు అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-బాపట్ల

అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్న దృశ్యం

బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు నరేంద్రవర్మ బాపట్లలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు దాతలు రూ.లక్ష విరాళం అందజేశారు. బుధవారం విద్యాదాత బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు, ప్రముఖ వైద్యులు దివంగత యార్లగడ్డ శ్రీ కృష్ణమూర్తి, ఆయన సతీమణి కస్తూరి జయంతిని పురస్కరించుకొని వారి కుమారుడు అమెరికా నివాసి యార్లగడ్డ భార్గవరామ్ ఆర్థిక సహాయంతో పది రోజుల పాటు అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నట్లు నరేంద్రవర్మ తెలిపారు. ఈ సందర్భంగా యార్లగడ్డ శ్రీకృష్ణమూర్తి, కస్తూరి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. టిడిపి వ్యవస్థాపకులు దివంగత ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పేదలకు పట్టెడు అన్నం పెట్టడమే లక్ష్యంగా బాపట్లలో నరేంద్రవర్మ నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ 108వ రోజుకు చేరింది. రూ.లక్ష విరాళం అందించిన భార్గవరామ్ మాట్లాడుతూ తమ మాతా, పితరుల స్మారకార్థం 10 రోజుల పాటు అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం చేయడం తమకు ఎంతో తృప్తినిస్తోందన్నారు. ఈ సందర్భంగా దాతలను నరేంద్రవర్మ సన్మానించారు. కార్యక్రమంలో గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీరలకు గిరాకీ

మొక్కజొన్న పైరుకు రక్షణ కవచాలుగా ఉపయోగపడుతున్న వైనం

ప్రజాశక్తి-పంగులూరు

చీరలకు గిరాకీ పెరిగింది. చీరలంటే అవి కట్టుడు చీరలో, పెట్టుడు చీరలో కావు. చుట్టుడు చీరలు. పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టూ చుట్టే చీరలన్న మాట. ఈ చుట్టుడు చీరలకు డిమాండ్ ఏర్పడడంతో వాటి ధర కూడా అమాంతం పెరిగిపోయింది. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని బాధిత రైతులు వాపోతున్నారు. పంగులూరు మండలంలో మొక్కజొన్న పంట ఈ సంవత్సరం ఆశాజనకంగా ఉంది. ఇప్పటివరకు ఎలాంటి తెగుళ్లు సోకకుండా రైతులు జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చారు. అయితే ఈ పైరును అడవి పందులు, నక్కల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు పలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇప్పుడిప్పుడే మొక్కజొన్న కండెలు వేస్తూ ఉంది. పాలకండెలుగా ఉన్న దశలో జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో అడవి పందుల నుంచి, నక్కల నుంచి పంటను కాపాడుకునేందుకు, పొలం చుట్టూ కరెంటు తీగలు పెట్టేవాళ్లు. డబ్బాలతో కొన్ని శబ్దాలు చేస్తూ వాటిని రాకుండా పైరును కాపాడుకునేవాళ్ళు. అయితే ఇప్పుడు వాటినుంచి పంటను కాపాడుకునేందుకు, మొక్కజొన్న పొలం చుట్టూ చీరలు కట్టే పరిస్థితి వచ్చింది. రకరకాల రంగుల్లో ఉండే ఈ చీరలు చూసి అడవి పందులు, నక్కలు

మొక్కజొన్న పంట సాగు చేసిన పొలం చుట్టూ చీరలు కట్టిన దృశ్యం

రాకుండా ఉంటాయని భావించిన రైతులు, ప్రతి మొక్కజొన్న చేనుకు చీరలు కడుతున్నారు. పంగులూరు మండలంలో సుమారు 4,600 ఎకరాల్లో ఈ సంవత్సరం మొక్కజొన్న పైరు సాగు చేశారు. ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు భావిస్తున్నారు. ఈ దశలో పైరును కాపాడుకునేందుకు రైతులు వెనకాడడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని చీరలు అమ్మేవాళ్ళు ధరలను విపరీతంగా పెంచారు. ఒక్కో చీర 25 రూపాయల నుంచి, 30 రూపాయలు వరకు ధర పలుకుతోంది. గతంలో ఒక్కో చీర 15 రూపాయలకు ఇచ్చేవారని రైతులు తెలిపారు. ఎకరాకు 100 నుంచి 110 చీరల వరకు అవసరం అవుతుంది. ఎకరాకు సుమారు మూడు వేల రూపాయల వరకు ఈ చీరలకే ఖర్చవుతుంది. అయినా కూడా రైతులు మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు చీరలు కొని, పొలాల చుట్టూ కడుతున్నారు. రైతుల అవసరాలను గుర్తించి చీరలు అమ్మేవాళ్లు ఈ సంవత్సరం చీరల ధరలు విపరీతంగా పెంచారని రైతులంటున్నారు.

పాఠశాలకు వెళ్లాలంటే..

రెండు కిలో మీటర్లు నడవాల్సిందే..!

- గంగ దొనకొండ విద్యార్థుల అవస్థలు
- ఆర్‌టిసి బస్సు నడపాలని విజ్ఞప్తి

కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-కురిచేడు

విద్యార్థుల చదువు కోసం ఎంతో ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం... విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో హహంగులే కాదు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలనూ గుర్తించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. . మండల పరిధిలోని గంగ దొనకొండ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లేదు. ఆ గ్రామంలోని పిల్లలు హైస్కూల్ చదువుల కోసం గ్రామానికి 2 కిలో మీటర్ల దూరంలో గల పొట్లపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లక తప్పదు. గంగ దొనకొండలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులు 200 మంది వరకూ ఉన్నారు. వారంతా నిత్యం కాలి నడకన రహదారిపై ప్రయాణం సాగిస్తున్నారు. రహదారిలో వాహనాల రాకపోకలతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రెండు కిలో మీటర్ల మేర బరువైన పుస్తకాల బ్యాగులతో కాలి నడక సాగక విద్యార్థులు అలసిపోతున్నారు. నిత్యం ఉదయం... సాయంత్రం కాలి నడకన 4 కిలో మీటర్ల మేర ప్రయాణిస్తున్న చిన్నారులు ఇంటికి చేరుకునే సరికి అవస్థలు పడుతున్నారు. కిలో మీటర్ల కొద్ది కాలి నడక కారణంగా సమయం కూడా వృథా అవుతోంది. గంగ దొనకొండ నుంచి పొట్లపాడు గ్రామానికి విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్‌టిసి బస్సు నడపకపోవడమే ఇబ్బందులకు కారణమవుతోంది. కాలి నడక ప్రయాణంలో మార్గ మధ్యలో దాహం వేసినా నీరు కూడా లభ్యత కాదు. ఆర్‌టిసి బస్సు కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కాలి నడకతో సకాంలో పాఠశాలకు చేరుకోలేక ఉపాధ్యాయుల మందలింపులకు తమ పిల్లలు గురవుతున్నారని, తక్షణమే బస్సు నడపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

జగనాసుర రక్తచరిత్ర పుస్తకం ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పామూరు

మండల పరిధిలోని కంబాల దిన్నె గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద జగనాసుర రక్తచరిత్ర పుస్తకాన్ని టిడిపి నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కంబాల దిన్నె పంచాయతీ ఇన్‌ఛార్జి కోటపాటి వెంకటేశ్వర్లు, గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య, ఉపాధ్యక్షులు పొన్నగంటి రోశయ్య, ఏలూరు నరసింహారావు, అధ్యక్షుడు యాదల చెన్నకేశవులు, మండల కార్యదర్శి మహిళ నల్లబోతుల జయమ్మ, నియోజకవర్గ మహిళ ఉపాధ్యక్షురాలు ఓరగంటి సుబ్బమ్మ, గ్రామ మహిళా అధ్యక్షురాలు గోవిందమ్మ, ఏలూరు మహేశ్వరరావు, కొండా మాల కొండయ్య, సానుమూరు వెంకటేశ్వర్లు, సంక్య లోకేశ్వరరావు, కొమ్మలపాటి రమణయ్య, చెన్నకేశవులు, కొండా వెంకటేశ్వర్లు, గోళ్ళ నరసింహరావు, ఏలూరి మహేశ్వర్ బాబు పాల్గొన్నారు. **పొదిలి** : ముఖ్యమంత్రి సీటు కోసం సొంత బాబాయినే చంపించిన మహా నాయకులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కత్తిపోటును గుండెపోటుగా చిత్రీకరించి, తమ బాబాయికి గుండెపోటు వచ్చిందని ప్రకటనలు ఇచ్చారన్నారు. గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించిన సిఎంకు ప్రజల్లో మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. అనంతతరం జగనాసుర రక్తచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, ముల్లా ఖుద్దూస్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ బాషా, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, జిల్లా నాయకులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం.బాషా, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదు : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

శింగరాయకొండ : పేదల కష్టాలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. సింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ పంచాయతీ లోని గవదగట్ల వారి పాలెంలో ఇదేం కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సన్నిబోయిన శ్రీనివాసులు నాయుడు, వేల్పుల సింగయ్య, మించల బ్రహ్మయ్య, గాలి హరిబాబు, ఉప సర్పంచి నక్క బ్రహ్మేశ్వరరావు, ఇమ్మడిశెట్టి రామారావు, షేక్ అబ్దుల్ సుభాన్, సుదర్శి ప్రసాద్, శీలం సుబ్రహ్మణ్యం, మురళి పాల్గొన్నారు. **యర్రగొండపాలెం** యర్రగొండపాలెంలోని వినుకొండ రోడ్డు ,అయ్యప్ప నగర్, బీసీ కాలనీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిదపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి మూడున్నరేళ్ళ వైసిపి పాలనలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. అ ఈ కార్యక్రమంలోనాయకులు మస్తాన్ వలి, మంత్రునాయక్, ప్రసాద్, యూసుఫ్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సూపరింటెండెంట్, పక్కన రోగి, వైద్య బృందం

ఆగిన గుండె మళ్లీ పునరుద్ధరణ

జిజిహెచ్‌లో అరుదైన ఆపరేషన్

గుంటూరు జిల్లాప్రతినిధి : ఆగిపోయిన వృద్ధుడి గుండెను మళ్లీ పునరుద్ధరించి అరుదైన ఆపరేషన్‌ను గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) వైద్యులు విజయ వంతంగా నిర్వహించారు. వివరాలను జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్. ప్రభావతి బుధవారం వెల్లడించారు. ప్రకాశం జిల్లా శింగరాయ కొండ మండలం నందనవనం గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు వెంకటేశ్వర్లు కొంతకాలం నుంచి కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం, వాంతులతో బాధ పడుతున్నాడు. దీంతో బంధువులు తొలుత ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గుంటూరు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో గత నెల 18న జిజిహెచ్‌కు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు చేసి కడుపులో కేన్సర్ గడ్డ ఉండటం వల్ల వాంతులు వస్తున్నాయని నిర్ధారణకు వచ్చారు. రోగి పాత రికార్డులను పరిశీలించి 20 ఏళ్ల కిందట గుండె ఆపరేషన్ చేసి స్టెంట్‌లు అమర్చినట్లు గుర్తించి గుండె వైద్యులను సంప్రదించారు. గుండె విభాగం వైద్యులు పరీక్షలు చేసి గుండె చాలా బలహీనంగా ఉందని, ఆపరేషన్ రిస్క్ చేయాల్సి వస్తుందని చెప్పారు. సర్జరీ వైద్యులు మళ్లీ వివిధ పరీక్షలు చేసినా సమస్య నిర్ధారణ కాలేదు. రోగికి మాత్రం వాంతులు తగ్గక ఆహారం తీసుకోలేక పోతున్నాడు. ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వై. కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 2న ఆపరేషన్‌ను ప్రారంభించారు. కడుపును ఓపెన్ చేసి చూడగా ఛాతికి కడుపునకు మధ్యభాగంలోని కండరాల్లో చిన్న రంధ్రం ఉన్నట్లు గుర్తించారు. కడుపులోని ప్రేగులు గుండె, ఊపిరితిత్తులకు అతుక్కు ఉన్నట్లుగా గమనించారు. ఈ సమస్యను డయాఫ్రమెటిక్ హెర్నియాగా గుర్తించారు. ఈ క్రమంలో బాధితునికి హఠాత్తుగా గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. ఛాతిపై నుంచి మసాజ్ చేస్తే గుండె కొట్టుకుంటుందని మత్తు వైద్యులు సూచించినా రోగి వయస్సు రీత్యా సాధ్యం కాదనుకున్నారు. డాక్టర్ కిరణ్ కుమార్ సమయస్ఫూర్తితో కడుపులో ఉన్న చేతిని నేరుగా గుండెను నొక్కి మసాజ్ చేయడంతో కొద్ది క్షణాల్లో గుండె కొట్టుకోవడం ప్రారంభించింది. ఆ తర్వాత శస్త్ర చికిత్స కొనసాగించి పొట్టలోని పేగులను కడుపులోకి లాగి డయాఫ్రమెటిక్‌కి ఉన్న రంధ్రాన్ని మూసి వేసి దానిపై ప్రొలెనే మెష్ అమర్చి పటిష్టంగా ఉండేలా చేశారు. 48 గంటలు ఐసియులో వెంటిలేటర్‌పై ఉంచారు. గుండె, ఊపిరి తిత్తులు, మెదడు పని చేస్తున్నాయని నిర్ధారణకు వచ్చి వెంటిలేటర్‌ను తొలగించి ద్రవ హారాన్ని ఇవ్వడంతో రోగి కోలుకున్నాడు. దీంతో వెంకటేశ్వర్లు బుధవారం డిశ్చార్జి చేశారు. ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ అభి నందించారు. ఈ చికిత్సలో వైద్యులు రమణాచలం, సంతోష్, వెంకట రమణ, వంశీ, కిషోర్, నిఖిల్, లిఖిత, కోటి, వేణు, అనూష, మత్తు వైద్యులు మహేష్‌బాబు, ప్రదీప్, ధరణి,స్వేత పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఆగిన 258 టైర్ల లారీ

ఎంత పెద్ద లారీయో...

శింగరాయకొండ : జాతీయరహదారిపై శింగరాయకొండ వద్ద 258 టైర్లు కలిగిన పెద్దలారీ బుధవారం ప్రయాణించింది. నెల్లూరు జిల్లా కష్ణపట్నం పోర్టు నుంచి విజయవాడకు ఈ లారీ బయలు దేరింది. రాత్రి సమయంలోనే ఈ లారీ ప్రయాణిస్తోంది. జాతీయ రహదారిపై శింగరాయకొండ వద్ద ఈ లారీని నిలుపుల చేశారు. 258 టైర్లు కలిగిన ఈ లారీ వెంట మరో రెండు లారీలు కూడా ప్రయాణిస్తున్నాయి. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహన చోదకులు ఈ లారీని ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.

ఈవిఎం గోడౌన్‌లో పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు కల్పిస్తున్న భద్రత, నిర్వహణ విషయంలో ఎలాంటి. లోపాలు లేకుండా చూడాలని కలెక్టర్ నేష్ కుమార్ స్పష్టం చేశారు. నెలవారీ తనిఖీలలో భాగంగా మామిడిపాలెంలోని ఈవిఎం గోదాములో తలుపులకు వేసిన సీల్‌ను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈవిఎంలు భద్రపరిచిన తీరు, గోదాముల వద్ద కల్పిస్తున్న భద్రతపై అధికారులు వివరించగా కలెక్టర్ సంతప్తి వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి

పందులు పట్టివేత

వాగ్వాదానికి దిగిన పెంపకందారులు

దొనకొండ : దొనకొండ పంచాయతీలో పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నారు. ప్రధానంగా ఓబ్బాపురం, ఆర్‌సిఎం స్కూల్, శివాజీనగర్, బేతేలుపురం ప్రాంతాల్లో పందులు అధిక సంఖ్యలో తిరుగుతున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తికి అనేకసార్లు తీసుకెళ్లారు. సర్పంచి కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు సమావేశమై పందులను గ్రామంలో నుంచి ఊరి బయటకు తరలించేలా గతంలో తీర్మానం చేశారు. అందులో భాగంగా పందుల పెంపకం దారులకు దొనకొండ నుంచి రుద్రసముద్రం వెళ్ళే రహదారిలో తహశీల్దారు పి.వెంకటేశ్వర్లు 2 ఎకరాల భూమిని కేటాయించారు. పందులు తాగేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో బోరు వేయించారు. దీంతో పందులు పెంపకందారు మొక్కుబడిగా 10 రోజులు అక్కడ ఉంచారు. అనంతరం వదిలేశారు. దీంతో పందులు దొనకొండ వీధుల్లో తిరుగుతుండటంతో పంచాయతీ కార్యదర్శి వాటిని ఆటోలో ఎక్కించగా పెంపకం దారులు అడ్డుపడి ఈ ఒక్కసారికి వదిలి పెట్టండి, మేము ఊరికి దూరంగా పెంచుకుంటామని చెప్పారు. అయితే మళ్లీ పందులు గ్రామంలో సంచరిస్తుండటంతో స్పెషల్ డ్రైవ్ కింద బుధవారం 60 పందులను పట్టించి ఆటోకి ఎక్కించారు. దీంతో పెంపకందారులు మూకుమ్మడిగా పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చారు. కార్యదర్శిని దుర్భాషలాడారు. రూ.4 లక్షలు డబ్బులు ఇవ్వలేదని పందులను పట్టిస్తావా అంటూ కార్యదర్శితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయం గురించి తెలుసుకున్న సర్పంచి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పందులు తరలించకుండా ఉంటేందుకు కార్యదర్శి రూ.4 లక్షలు డబ్బులు అడిగారనటం అవాస్తవమని తెలిపారు.వీధుల్లో పందులను సంచరించకుండా చర్యలు తీసు కుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ఇమ్రాన ఖాన్, ఎంపిటిసి గుంటు అజయ్, వార్డు మెంబర్లు బొందల రాజు, కె.రామారావు, భట్టు వెంకటేశ్వర్లు, గ్రామ నాయకుడు కొమ్మతోటి సుబ్బారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షుడు విక్టర్ ఇమ్మానుయేల్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సిజిఆర్ఎఫ్)అధ్యక్షుడు, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. స్థానిక విద్యుత్‌శాఖ డిఇ కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్ మరియు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ సమస్యలపై విక్టర్ ఇమ్మానుయేల్‌కు లిఖితపూర్వకంగా వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించిన విక్టర్ ఇమ్మానుయేల్ సత్వరమే ఆ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. అనంతరం విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ విద్యుతు వినియోగదారులు తమ హక్కుల పట్ల తప్పక అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులు, గ్రామీణ విద్యుత్ వినియోగదారులను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సిజిఆర్ఎఫ్ వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. లో, హై ఓల్టేజ్, విద్యుత్ కనెక్షన్లలో జాప్యం, బిల్లింగ్, సరఫరాలో అంతరాయం,

మాట్లాడుతున్న విక్టర్ ఇమ్మానుయేల్

తదితర సమస్యలు తలెత్తినప్పుడు టోల్‌ఫ్రీ నంబరు 1912 కుముందుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యుత్ అధికారుల నుంచి సరైన స్పందన లేని పక్షంలో, సమస్య పరిష్కారం కాకుంటే ఈ ఫోరంకు ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చని తెలిపారు. కేవలం 60 రోజుల్లోపే వారికి ఉచితంగా న్యాయం జరుగుతుందన్నారు. వినియోగదారులు ప్రత్యేకంగా సివిల్ కోర్టులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారులు నేరుగా గానీ, కేవలం ఒక లేఖ, లేదా ఇ-మెయిల్ ద్వారా తమ సమస్యలను సిజిఆర్ఎఫ్‌కు తెలియజేయవచ్చునన్నారు. రీడర్లు విద్యుత్ మీటర్ రీడింగ్‌లను సకాలంలో తీయాల్సి ఉందన్నారు. సమస్యలను స్థానిక అధికారులు పరిష్కరించనప్పుడు తగిన ఆధారాలతో ఫోరం దష్టికి లిఖితపూర్వకంగా తీసుకురావాలన్నారు. అప్పుడు సేవల్లో జాప్యానికి పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్‌షాక్ కారణంగా ఎవరైనా మరణిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. విచారణ అనంతరం రూ.5లక్షలు వరకూ పరిహారాన్ని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మండల పరిధిలోని రాయవరం, నరశింహాపురం గ్రామాల్లో నివాస గృహాలకు సంబంధించి విద్యుత్ బిల్లులు ఎక్కువ వస్తున్నాయని బాధితులు జి.రామయ్య, షేక్ ఖాశిం లోక్ అదాలత్ అధ్యక్షుడి దృష్టికి తీసుకొచ్చారు. బిల్లింగ్ డేటా పరిశీలించిన అధ్యక్షుడు బిల్లులో 40 నుంచి 50 మేర తగ్గించి మిగిలిన బిల్లును వాయిదా పద్ధతిలో చెల్లించాలిని బాధితులకు ఆదేశించారు. మొత్తం 20 మంది వినియోగదారులు వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అందులో 13 మంది సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో (సిజిఆర్ఎఫ్) సాంకేతిక సభ్యుడు కె. వెంకటకృష్ణ, స్వతంత్ర సభ్యుడు ఎ. సునీత, ఇఇ నాగేశ్వరరావు, మార్కాపురం, వైపాలెం, కంభం, గిద్దలూరు ఏడీలు నాయక్, రాఘవేంద్ర, బాలఅంకయ్య, ఎఇ యశోదమ్మ, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా పొగాకు కొంటే చర్యలు

ప్రజాశక్తి-టంగుటూరు

అక్రమంగా పొగాకు అమ్మకాలు, కొనుగోళ్లు జరిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని మొబైల్ విజిలెన్స్ బందం అధికారులు, వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామ పరిసరాలలో అక్రమంగా తరలిస్తున్న 114 పొగాకు బేళ్లను బోర్డు మొబైల్ విజిలెన్స్ బందం పట్టుకున్నట్లు తెలిపారు. దీనిపై లారీ డ్రైవర్ ను విచారించగా కందుకూరు, పొన్నలూరు, కె అగ్రహారం, కామేపల్లి తదితర గ్రామాల రైతుల నుంచి పొగాకును కొనుగోలు చేసినట్లు చెప్పారన్నారు. అధికారులు స్వాధీనం చేసుకున్న పొగాకును టంగుటూరు వేలం కేంద్రానికి తెచ్చి బుధవారం సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొబైల్ విజిలెన్స్ బందం అధికారులు టి.గౌతమ్, ఎ.జస్వంత్, ఆర్. నవీన్ నాయక్, ఎస్‌జిఒ సునీల్ కుమార్ పాల్గొన్నారు. **కొండపి :** పొగాకు వేలం కేంద్రాల వెలుపల పొగాకు కొనుగోళ్లు, అమ్మకాలు పొగాకు బోర్డు చట్ట వ్యతిరేకం అని కొండపి పొగాకు వేలం

అధికారులు స్వాధీనం చేసుకున్న పొగాకు బేళ్లు

నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకును వేలం కేంద్రాల వెలుపల అక్రమముగా కొనుగోలు చేసినా, అమ్మినా ఆ పొగాకును బోర్డు వారు సీజు చేసి అధిక మొత్తంలో అపరాధ రుసుం విధిస్తారని తెలిపారు. అక్రమ పొగాకు కొనుగోళ్ళుకు సంబంధించి ఎవరైనా సమాచారాన్ని పొగాకు బోర్డు వారికి అందిస్తే వారికి తగిన పారితోషకం ఇవ్వనున్నట్లు తెలిపారు.

పైరు వేస్తేనే ఈ క్రాప్ నమోదు : ఎడిఎ

ప్రజాశక్తి-మర్రిపూడి

పైరు వేస్తేనే ఈ-పంట నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యాలయ ఎడిఎ డి. చంద్రకళ తెలిపారు. ఈ క్రాప్ నమోదు నిజ నిర్ధారణ (సూపర్‌చెక్) కోసం మండలంలోని తిప్పలదేవిపల్లి గ్రామంలో శనగ, మిరప, వరి పంటలను బుధవారం పంటలను పరిశీలించారు. తొతుల కూచిపూడి రైతు భరోసా కేంద్రంలో ఏయే పంటలు, ఎంతెంత విస్తీర్ణంలో సాగు చేశారో, రైతులు ఎవరైనా ఏదైనా కారణాల వలన పంట కోతకు ముందే దున్నివేశారా, నీటి వసతి మొదలైన ప్రాథమిక సమాచారాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారి కృష్ణ, గ్రామ సర్వేయర్ భానువెంకట్ కలిసి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ ఖచ్చితంగా పైరు వేస్తేనే ఈ క్రాప్ నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు టెక్నికల్ ఎఒ రాధారాణి, మర్రిపూడి ఎఒ వెంకటేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు మణికృష్ణ, రైతులు పాల్గొన్నారు. **పొదిలి :**

పంటలు పరిశీలిస్తున్న ఎడిఎ చంద్రకళ

రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎంతో ఉపయోగ కరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయం ఎడిఎ చంద్రకళ తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఈ క్రాప్ నమోదును సూపర్ చెక్‌లో భాగంగా పంట పొలాలను పరిశీలించారు. అందులో భాగంగా ఆమె శనగ పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎఒ రాధారాణి, స్థానిక ఎఒ షేక్ జైను లాబ్దిన్, గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్, అమృతకళ, కోటిరెడ్డి, విఆర్‌ఒ రోశమ్మ, గ్రామసర్వేయరు పుల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-టంగుటూరు

కూలీలకు మార్చి 31 నాటికి ఉపాధి హామీ పనులు 100 రోజుల లక్ష్యం పూర్తి అయ్యేలా చూడాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శీనారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రావివారిపాలెం, అమ్మవారికుంట వద్ద నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను పీడీ శీనారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కూలీలకు 100 రోజుల పని లక్ష్యం పూర్తికావడంతో రోజు వారి వేతనం రూ. 257 వచ్చేలా పనులు కల్పించాలన్నారు. కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం కాకుంటే ఆధార్ అనుసంధానం ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుభాషిణి, ఇసి దివికుమార్, టిఎ బాబు, ఎఫ్ఎ మనోహర్, కూలీలు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి

రవి చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి- జరుగుమల్లి

మండలపరిధిలోని కె.బిట్రగుంట గ్రామంలో రాయవరపు రవి దశ దినకర్మ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని రవి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వట్టిగుంట శివాజి, రాయవరపు వెంకట నారాయణ, నిమ్మకాయల వెంకటేశ్వర్లు, వరికూటి జగన్ మోహనరావు, అన్నంగి దేవరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండల పరిధిలోని గొబ్బూరు రైతు భరోసా కేంద్రాన్ని ఎఒ కె.బుజ్జిబాయి బుధవారం పరిశీలించారు. అనంతరం పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ విషపూరిత మందులు స్ప్రే చేయడం వలన కలిగే నష్టాల వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సాయకులు సురేఖ, రైతులు పాల్గొన్నారు.

17న నిర్వాసితులతో ముఖాముఖి

పెద్దారవీడు : మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో ఈ నెల 17న వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల బాధితులను బుధవారం కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ ముఖాముఖి కార్యాక్రమానికి సిసిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకష్ణ, సిఐపి బందం హాజరు కానున్నట్లు తెలిపారు. చిన్నచిన్న కారణాలతో అధికారులు గెజిట్ లబ్ధిదారుల పేర్లు తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. సుంకేసుల, కలనూతల, గుండంచర్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు వీరారెడ్డి, సిపిఐ మార్కాపురం నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, యర్రగొండపాలెం నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, నాయకులు చెన్నయ్య, కష్ణగాడ్, రామయ్య, గురునాధం, విశ్వరూపాచారి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

టంగుటూరు : కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గత 2 రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన కంటి పరీక్షలలో 36 మంది విద్యార్థులకు దష్టిలోపం ఉన్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. స్థానిక ఎంజెపి బాలికల గురుకుల సంక్షేమ పాఠశాలలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్ ప్రసాద్ బాబు, డాక్టర్ బాలాజీ అశోక్ బుధవారం మాట్లాడుతూ టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 350 మందికి, ఎంజేపీ బాలికల పాఠశాలలో 140 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. దష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులకు త్వరలోనే కంటి అద్దాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్‌ఒ వెంకటేశులు, కంటి విభాగం అధికారి కష్ణారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు అనురాధ, కామేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ డిగ్రీ కళాశాలలో వృత్తి శిక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రతి ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో స్కిల్ హబ్ సెంటర్, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం స్కిల్ కాలేజీని ప్రారంభించనున్నారు. అందులో భాగంగా యర్రగొండ పాలెంలోని గవర్నమెంట్ మోడల్ డిగ్రీ కాలేజ్‌లో స్కిల్ కాలేజిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ నాయుడు బుధవారం తెలిపారు. ఈ కాలేజీలో 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా ,డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన యువతకు అవకాశం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆలోచన విధానంతో చదువుకోని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీయువకుల స్కిల్ హబ్ సెంటర్స్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కోర్సు వ్యవధి : 400 గంటలు ,సోలార్ ప్యానెల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ వ్యవధి : 540 గంటలు చొప్పున శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.ఆసక్తి కలిగిన ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం

దర్శి : మండల పరిధిలోని పోతవరం శివాలయం అభివృద్ధి కోసం ధర్మకర్త కొప్పురావూరి బాబూరావుకు రాష్ట్రమాజీ మంత్రి శిద్దా రాఘవరావు అందజేసి లక్ష రూపాయలు నగదును శిద్దా ప్రతినిధి మందాది సుబ్బారావు బుధవారం అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు ధర్మకర్త బాబూరావు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కాశీపురంలో నిర్మించిన సిసి రోడ్డును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌళిక వసతుల కల్పకు ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే కుటుంబ శ్రేయస్సు

లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ కృష్ణనాయక్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఆర్థిక అక్షరాస్యతపై కుటుంబం శ్రేయస్సు ఆధారపడి ఉంటుందని లీడ్ బ్యాంకు బాపట్ల జిల్లా మేనేజర్ కృష్ణ నాయక్ అన్నారు. అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ఇసుకదర్శి గ్రామ సచివాలయం వద్ద ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్తు లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లీడ్ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంకులో పొదుపు చేయడం కనీస బాధ్యతగా గుర్తుంచుకోవాలని అన్నారు. బ్యాంకులు అందిస్తున్న నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి ఆధునిక సేవలను వినియోగించుకోవాలన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద అపరిచితులకు పిన్ నంబర్ ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని కోరారు. రైతులు, డ్వాక్రా మహిళలు బ్యాంక్‌లు అందిస్తున్న సేవలను వినియోగించుకొని వృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు. మార్టూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఉల్లగంటి వెంకట సత్య ప్రసాదరావు మాట్లాడుతూ బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి సురక్ష యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, స్టేట్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్, కౌన్సిలర్ కోటేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి సురేష్, వెలుగు సిసి కోటేశ్వరమ్మ స్థానిక వైసిపి నాయకులు వినుకొండ సుధాకర్, నరసింహారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లీడ్‌బ్యాంకు మేనేజర్ కృష్ణ నాయక్

సీఈసీలో 'కర్మయోగం' పోస్టర్ ఆవిష్కరణ

డైరెక్టర్ జయ్ చీరాల వాసి కావడం హర్షణీయం: డాక్టర్ అమృతపాణి

ప్రజాశక్తి-చీరాల

కట్ట ప్రొడక్షన్ బ్యానర్‌పై నూతనంగా నిర్మిస్తున్న సినిమాకు సంబంధించిన టైటిల్‌తో పాటు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధ వారం చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో సందడి గా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా హాజరైన చీరాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి రవికుమార్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అమృతపాణి, విశ్రాంత ఏసిపి కట్టా రాజ్ వినయ్ కుమార్ చేతుల మీదుగా సినిమా టైటిల్‌తో పాటు మొదటి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ సినిమా డైరెక్టర్ కట్టా జయ్ తన విద్యార్థి అని చెప్పారు. చదువుతోపాటు మనకు ఆసక్తి ఉన్న రంగంలో కష్టపడి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని, దీనికి ఉదాహరణ జయ్ అని అన్నారు. అమృతపాణి మాట్లాడుతూ చీరాల ప్రాంతానికి చెందిన యువకుడు సొంతంగా సినిమా తీయడం హర్షణీయమన్నారు. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కట్టా రాజ్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మంచి ప్రణాళికతో కష్టపడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చును అన్నారు. డైరెక్టర్ జయ్ మాట్లాడుతూ తాను ఈ ప్రాంతంలోనే ఇంజనీరింగ్ చదివి సినిమా రంగంలో రాణించాలనే తలంపుతో అక్కడికి వెళ్లినట్లు పేర్కొన్నారు. మొదటిసారి సొంతంగా సినిమా నిర్మిస్తున్నట్లు తెలిపారు. సినిమా పేరు 'కర్మయోగం' అని ప్రకటించారు. దీని మొదటి పోస్టర్‌ను ఈ ప్రాంతంలో ఆవిష్కరించాలని ఉద్దేశంతో ఇక్కడ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సినిమాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సినిమా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

కర్మయోగం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అమృతపాణి, కట్టా రాజు వినయ్ కుమార్

మనుస్మృతి ఆవిష్కరణ పట్ల నిరసన

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

హైదరాబాద్‌లో బుధవారం జరుగుతున్న మనుస్మృతి ఆవిష్కరణను నిరసిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెంలో ఖాజీపాలెం పంచాయతీ పరిధిలో గల మండవారిపాలెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు తెలిపి మనుస్మృతి పోస్టర్లు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె శరత్ మాట్లాడుతూ మనువాదుల నేతృత్వంలో ఈ నెల 15న మనుస్మృతి అనే అపవిత్ర గ్రంథాన్ని ప్రాచీన భారత రాజ్యాంగం అంటూ ఈరోజు హైదరాబాదులో మనువాద మతోన్మాదులు ఆవిష్కరిస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ ఈ కుట్రకు పాల్పడుతున్నాయని అన్నారు. భారత రాజ్యాంగంలో బలమైన చట్టాలు ఉండబట్టే భారతదేశంలో చాయ్ వాలా కూడా దేశానికి ప్రధానమంత్రి కాగలిగారని పేర్కొన్నారు. అలాంటి మన భారత రాజ్యాంగ రద్దుకు కుట్రలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. మనువాద మతోన్మాదులు రాజ్యాంగం ద్రోహులు చేస్తున్న ఈ దుర్మార్గపు చర్యలను కెవిపిఎస్ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం బాపట్ల జిల్లా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు పి మోషే, బి డేవిడ్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎం వంశీ, ఎం రాహుల్, వి నితిన్, వంశీ సిహెచ్ సన్నీ, పి రుషి, సిహెచ్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శరత్

జాతీయ స్థాయి పోటీలకు చింతాయపాలెం విద్యార్థులు

ప్రజాశక్తి-కర్లపాలెం

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు చింతయపాలెం విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు పోటీతత్వం అలవడుతుందని పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 66వ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో అండర్ 17 బాలికల విభాగంలో పదో తరగతికి చెందిన విద్యార్థిని పులి పల్లవి బంగారు పతకం, 9వ తరగతికి చెందిన షేక్ జాస్మిన్ కాంస్య పతకం గెలుపొందారు. అండర్ 17 బాలుర, బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని పిట్టు అనురాధ బంగారు పతకం, 10వ తరగతి విద్యార్థి కుంచాల పృథ్వీరెడ్డి కాంస్య పథకాన్ని సాధించారు. అండర్ 19 బాలుర విభాగంలో 8వ తరగతి విద్యార్థి కుంచాల భాను కాంస్య పతకాన్ని గెలుపొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ షకీనా, పద్మకుమారి, ఇందిరాదేవి, నర్రా శ్రీనివాసరావు, శేషు, శ్రీనివాసరెడ్డి, రాఘవేంద్ర, డేవిడ్, ఎస్‌కే జిలాని, రత్న పరమేష్, పిఎంసి కమిటీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ ఇతర సిబ్బంది గ్రామపెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులు క్రమశిక్షణతో నడుచుకోవాలి

ప్రజాశక్తి-చీరాల

దేశ రక్షణలో పాల్గొన్న మాజీ సైనికులు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ మాజీ సైనికులు అందరూ సమాజంలో క్రమశిక్షణతో నడుచుకోవాలని అదే విధంగా సమాజానికి సహాయ పడాలని ఆంధ్రప్రదేశ్ సైనిక సంక్షేమ శాఖ సంచాలకులు బ్రిగేడియర్ వి వెంకటరెడ్డి అన్నారు. మాజీ సైనికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందించబడుతున్న పలు సంక్షేమ పథకాల గురించి సైనికులకు తెలియ జేసేందుకు చీరాలలోని స్థానిక అంబేద్కర్ భవనంలో చీరాల మాజీ సైనికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు.మాజీ సైనికులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పర్ష్ కొత్త పెన్షన్ విధానం గురించి తెలియజేశారు. మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించేందుకు అసోసియేషన్ అన్నివేళలా ముందుంటుందని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం మాజీ సైనికుల నుంచి వివిధ సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఆయన వెంట జిల్లా సైనిక సంక్షేమ అధికారులు రజినీ, ఆర్ గుణశీల, చీరాల నాయకులు శాంతయ్య, శ్రీనివాసరావు, రమణయ్య, శికామణి, రామయ్య, పలువురు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

పాఠశాల విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయమని ఆరేపల్లి మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరువీధుల గురునాథం అన్నారు. మండల పరిధిలోని ఆరేపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం మండల పరిధిలోని రాజవోలు గ్రామానికి చెందిన కోనేరు మధుసూదనరావు పాఠశాల విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన పథకం ప్లేట్లు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. గురునాథం, ఉపాధ్యాయులు కాటూరి నాగేశ్వరరావు, మరదాపు కోటేశ్వరరావు, శంషుద్దీన్, పిఎంసి చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ కవి గాలిబ్ చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

ఉర్దూ సాహితీ జగత్తులో మహాకవి గాలిబ్ స్థానం మహోన్నతమైనదని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. బుధవారం ప్రఖ్యాత ఉర్దూ కవి గాలిబ్ 154వ వర్ధంతి సందర్భంగా సాహితీ భారతి ఆధ్వర్యంలో గాలిబ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నరసింహవర్మ మాట్లాడుతూ గాలిబ్ రచించిన దివానా ఏ గాలిబ్ అనే గ్రంథాన్ని ప్రముఖ కవి దాశరథి గాలిబ్ గీతాలు అనే పేరుతో తెలుగులో అనువదించిన గ్రంథాన్ని సినీ నటులు అక్కినేని నాగేశ్వరావుకు అంకితమిచ్చారన్నారు. దివానా ఏ గాలిబ్ రచనలు ప్రపంచ భాషల అనువాదంతో విశ్వవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన మహా గ్రంథమని వర్మ తెలియజేశారు. ప్రముఖ సాహితీవేత్త దివి శ్రీనివాసమూర్తి మాట్లాడారు. సాహిత్య భారతి కోశాధికారి ఆదం షఫీ, మర్రి మాల్యాద్రి రావు, పువ్వాడ వెంకటేశ్వర్లు ఎన్ కృష్ణ, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, రెంటాల మురళి రాధాకృష్ణమూర్తి, అవ్వారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామాల యూనిట్‌గా మిషన్ అంత్యోదయ

ప్రజాశక్తి-వేటపాలెం

రెవెన్యూ గ్రామాల వారిగా మిషన్ అంత్యోదయ కార్యక్రమాన్ని సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఎంపిడిఒ ఎంవిఎస్ శర్మ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్‌లో కార్యాలయంలో ప్రకాశం,బాపట్ల జిల్లాల డిపిఒలు నారాయణరెడ్డి, శంకర్ నాయక్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే మిషన్ అంత్యోదయ విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న అన్ని రకాల సమస్యలు, అవసరాలపై సంపూర్ణ నివేదిక తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు పర్వం పూర్ణకుమారి, బాలిగ సురేంద్ర, కె.రమేష్‌బాబు, ఎం శ్రీనివాసరావు, టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాచిన కృష్ణచైతన్య ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అద్దంకి: అద్దంకి పట్టణంలో కాళికా సమేత కమటేశ్వర స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ జీవపున: ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాప్ నెట్ ఛైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య, ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు ఆరిమండ వరప్రసాద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని వేద పండితులు ఆశీర్వదించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సందిరెడ్డి రమేష్, చెన్నుపల్లి శ్రీనివాసచారి, అనంత మురళీ రామ్మోహన్‌రావు, పొన్నపల్లి మల్లికార్జున, గుండుమేడ హనుమంతరావు, ఆళ్లగడ్డ వీర సుందరాచారి ఉన్నారు.

హ్యాండ్‌వాష్ స్టేషన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-వేటపాలెం

మరుగుదొడ్లు, హ్యాండ్ వాష్ స్టేషన్‌కు స్థానిక బిబిహెచ్ జూనియర్ కళాశాలలో బుధవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిసి హెచ్ఆర్ మేనేజర్ సిజె విజయలక్ష్మి మాట్లాడుతూ కంపెనీ ఆధ్వర్యంలో అనేక ప్రాంతాల్లో బంగారు భవిషత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫైనాన్స్ మేనేజర్ ఎల్‌విఎస్ ఫణి నిరంజన్ మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాలకు కొద్దోగొప్పో చేయాలనుకొంటున్న టైంలో కళాశాల ఛైర్మన్‌ను సంప్రదించి మహిళలకు మరుగుదొడ్ల సమస్య ప్రస్తావన తెచ్చారన్నారు. ఈ నేపథ్యంలోనే పది లక్షల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ కె సురేష్, ఫినిష్ సొసైటీ సాయికృష్ణ, వెంకయ్య, కళాశాల కరస్పాండెంట్ బండ్ల శరత్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ కోడూరి ఏకాంబరేశ్వరబాబు, ప్రిన్సిపాల్ పి బాలసుబ్రమణ్యం, సత్రం మల్లేశ్వరరావు, నాగమాంబ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై శిక్షణ

ప్రజాశక్తి-పంగులూరు: గ్రామాల్లో మౌలిక వసతులు ఉన్నాయా లేదా, ఉంటే ఎలా ఉన్నాయి అనే అంశంపై గ్రామపంచాయతీ సెక్రటరీలు సర్వే చేసే విధంగా మిషన్ అంత్యోదయ సర్వే ట్రైనింగును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం ఉదయం జిల్లా పరిషత్ సీఈఓ ఇచ్చారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా, ఏవేవి అందుబాటులో ఉన్నాయో తెలియజేయాలని సీఈఓ కోరారు. మండలంలోని గ్రామపంచాయతీ సెక్రెటరీ, ఎంపీడీవో రమణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ వేణుమాధవ్, సూపరింటెండెంట్ తానికొండ రమేష్, ఈవోఆర్డి రాంబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఇంకొల్లులో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన కొమరాబత్తిన శ్రీనివాసరావు(57) మృతి చెందగా నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహన్‌రావు, జెట్టి వెంకటేశ్వర్లు, గుంటూరు శంకర కంటి ఆసుపత్రికి సమాచారం అందించారు. శంకర కంటి వైద్యులు ఇంకొల్లు వచ్చి కార్నియాలు సేకరించారు. నేత్రదానం చేసినందుకు రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ అధ్యక్ష కార్యదర్శులు భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు లు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలను పరిశీలించిన పర్యవేక్షణ బందం

పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కంభం రూరల్

మండలంలోని ఎల్‌కోట జడ్‌పి ఉన్నత పాఠశాలను మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలనుఅకడమిక్ మానిటరింగ్ బందం సభ్యులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం పాఠ్య పణాళికలు,వార్షిక ప్రణాళికలు ఉపాధ్యాయుల దైనందినిలు, బోధనో పకరణాలను పరిశీలించారు. విద్యార్థుల ట్యాబుల వినియోగంపై ఆరా తీశారు. తరగతి వారీగా, సబ్జెక్ట్ వారీగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఉపాధ్యాయుల మాదిరి బోధనను పరిశీలించి పరిస్థితులను అంచనా వేశారు. తెలుగు, ఆంగ్ల భాషా సామర్థ్యా లను,చతుర్విధ ప్రక్రియలను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలు కలిగివుండేలా చూడాలని, భాషా నైపుణ్యాలను పెంపొందించాలనీ, విద్యార్థి కేంద్రీకతంగా కత్యాధార పద్ధతులను ప్రయోగిస్తూ బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు బైసాని వెంకట రామకష్ణ, వైవి.ఆచారి, విద్యా పర్యవేక్షక బందం సభ్యులు కె.వెంకటరమణయ్య, వై .వీరనారాయణ, బి.పిచ్చిరెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ఆధార్ నమోదు చేయాలి

కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రైవేటు ఆసుపత్రులలో పుట్టే ప్రతి బిడ్డకు ఆధార్ కార్డు కోసం తక్షణమే అక్కడే వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈ దిశగా అవసరమైన సర్క్యులర్ జారీ చేయాలని వైద్య శాఖను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబరులో జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఆధార్ కార్డుల నమోదు, అప్డేషన్ అవుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన చిన్నారులకు వారి తల్లిదండ్రుల బయోమెట్రిక్స్ ఆధార్ కార్డు జనరేట్ చేయాలన్నారు. ఐదేళ్ళు దాటిన తరువాత చిన్నారుల బయోమెట్రిక్స్ అప్డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి జననంతో ఆధార్ నమోదు గణాంకాలు సరిపోవాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కాలేజీలలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయాల న్నారు. ఐదేళ్ళు దాటినా అప్డేట్ చేసుకోని చిన్నారుల వివరాలను సేకరించి వారి బయోమెట్రిక్ వివరాలు అప్డేట్ చేసుకునేలా వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించాలని దిశా నిర్దేశం చేశారు. పుట్టిన తేదీలో మార్పులకు వచ్చే ప్రతి అర్జీని దరఖాస్తుదారుడు గెజిటెడ్ అధికారి చేత అటెస్టేషన్ చేయించాలన్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు కూడా ఈకెవైసి తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆధార్ కార్డులో వివరాలను మార్చే కేంద్రాలకు వస్తున్న దరఖాస్తులను ర్యాండ మ్‌గా వాటి వాస్తవికతను నిర్ధారించాలని స్పెషల్ బ్రాంచ్ పోలీసులను కూడా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ బి. చిన ఓబులేసు, డిఎం,హెచ్ఒ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఒంగోలు ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు, డిఇఒ పి.రమేష్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయ అధికారి ఉషారాణి, ఎల్‌డిఎం. యుగంధర్, సిఎస్‌సి జిల్లా కోఆర్డినేటర్ ప్రమోద్ కుమార్, యుఐడిఎ, పోస్టల్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు క్లియర్ చేయండి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నీరు-చెట్టు పథకంలో పెండింగ్ బిల్లులను త్వరగా క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం కలెక్టర్ ఛాంబరులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి పనులు, పూడికతీత, గట్లు పటిష్టపరచడానికి చేపట్టిన పనులు, వాటి బిల్లుల చెల్లింపులపై కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్ బిల్లులను క్లియర్. చేయడానికి మరో శాఖతో వాటిని పరిశీలన చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశీలన నివేదిక వచ్చిన తరువాత బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. నెలాఖరు నాటికి రిపోర్టు వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ లక్ష్మారెడ్డి, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్ వ్యవస్థను ఉపసంహరించుకోవాలి

ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్

మాట్లాడుతున్న రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ వ్యవస్థను ఉప సంహరించు కోవాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ వైవిబి.రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఈస్ట్ కెబి రెస్టారెంట్ సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి పట్టుకొమ్మలైన స్థానిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. స్థానిక ప్రభుత్వమైన గ్రామ పంచాయతీలకు ప్రాధాన్యత తగ్గిస్తూ వస్తోందన్నారు. ప్రజలకు మేలు చేయాలని భావిస్తున్న సర్పంచులు విధులు, నిధుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తుందన్నారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులను మళ్ళించటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం మ్యాచింగ్ గ్రాంట్లను ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సమస్యలపై ప్రశ్నించే సర్పంచుల పట్ల వివక్ష కొనసాగుతుందన్నారు. డిమాండ్ల సాధన కోసం మార్చి నెలాఖరులో నిర్వహిస్తున్న చలో అసెంబ్లీ కార్యక్రమంలో రాష్ట్రంలోని సర్పంచులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఛాంబర్ సలహాదారులు జి.వీరభద్రాచారి, సుబ్బరామయ్య, ఎం. రామకృష్ణారెడ్డి, పగడాల రమేష్, నెల్లూరు, గుంటూరు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

- అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు
- జేసీ అభిషిక్త్ కిషోర్

అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషిక్త్ కిశోర్

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. ఈనెల, మార్చి నెలలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలపై జేసీ అధ్యక్షతన ఆయా విభాగాలతో సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీసు, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్‌టిసి, పాఠశాల విద్య, పోస్టల్, విద్యుత్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా జేసీ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఉమ్మడి ప్రకాశం జిల్లాను ఒక యూనిట్ గా ఏర్పాటు చేసుకొని నిర్వ హిస్తున్నామన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 125 కేంద్రాలలో ప్రాక్టికల్ పరీక్షలు, 95 కేంద్రాలలో థియరీ పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రంలో 144 సెక్షన్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాట్లు, పరీక్షలు జరిగే సమయంలో జెరాక్స్ సెంటర్ల మూసివేత వంటి బాధ్యతలను నిర్వహిం చాలన్నారు. ప్రశ్నాపత్రాలకు కావలసిన భద్రత, పరీక్షా కేంద్రాలలో బందోబస్తు మరియు పర్యవేక్షణ బాధ్యతలను రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు చూడాలన్నారు. నిరంతర విద్యుత్ శక్తి సరఫరా జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాల న్నారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిఇఒకు సూచించారు ప్రతి పరీక్ష కేంద్రంలో తప్పనిసరిగా ఓ హెల్త్ అసిస్టెంట్ ఉండేలా చూడాలని డిఎం,హెచ్ఒకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ఐఒ ఎ. సైమన్ విక్టర్, డిఎం,హెచ్ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, డిఇఒ పి.రమేష్, ఇతర విభాగాల అధికారులు, ఇంటర్ పరీక్షల కమిటీ సభ్యులు పాల్గొన్నారు

డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలన

డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరంలోని 44వ డివిజన్ మారుతి నగర్‌లో రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనులు నాణ్యత గురించి అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు వంద శాతం పాటించాలని సూచించారు. కమిషనర్ వెంట స్థానిక కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాలరెడ్డి, డిఇఇ గణపతి, ఎఇ బాలకోటయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ బాజ్జీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.

పన్నులు వసూలు చేయాలి

మార్చి నెల సమీపిస్తున్నందున నగరపాలక సంస్థకు రావాల్సిన ఆస్తి, నీటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని సచివాలయ సిబ్బందికి కమిషనర్ వెంకటేశ్వరరావు సూచించారు. 44వ డివిజన్ మారుతినగర్ సచివాలయం పరిధిలో 2022-23 సంవత్సరానికి పెండింగ్‌లో ఉన్న పన్నులపై ఆ డివిజన్ సచివాలయంలో కమిషనర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం పన్నులు చెల్లించాల్సిన వారితో కమిషనర్ నేరుగా మాట్లాడారు. త్వరగా పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. మార్చి నెల చివరి లోపు పన్నులు చెల్లించేలా ప్రజలను సమాయత్తం చేయాలని సచివాలయ సిబ్బందికి కమిషనర్ సూచించారు.

పారిశుధ్య పనులు పరిశీలన..

మారుతినగర్ సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను కమిషనర్ వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. రోడ్లు, కాల్వల శుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.